EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
17-02-2025
పేజీలు: 02

## త్వరలో విశాఖలో రెండు ప్రాజెక్టులను ప్రారంభించనున్న చంద్రబాబు

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఈ నెలలో రెండు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని భావించగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఈ రెండు ప్రాజెక్టుల విలువ రూ.90 కోట్లు.వీఎంఆర్‌డీఏ సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దూరం నుంచి చూస్తే క్రూయిజ్ షిప్ మోడల్‌లో కనిపించే ఈ భవన నిర్మాణానికి రూ.87.5 కోట్లు ఖర్చు చేశారు. ఇది 11 అంతస్థుల భవనం. బేస్‌మెంట్‌లో మూడు అంతస్థులు, పైన మొదటి, రెండో అంతస్థులు (మొత్తం ఐదు) పార్కింగ్‌కు కేటాయించారు. 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు పార్క్ చేసుకోవచ్చు. మూడో అంతస్థు నుంచి ఏడో అంతస్థు వరకు (ఐదు అంతస్థులు) ఐటీ సంస్థకు కేటాయిస్తారు. ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు.రామకృష్ణా బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్ పక్కనే యూహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణం కూడా చివరి దశకు వచ్చింది. నేవీలో సుమారు పదిహేడేళ్లు సేవలుందించి గత ఏడాది జూన్ 28న ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగిన 'యూహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను ఇక్కడి మ్యూజియంగా పెడుతున్నారు. దీనికి రూ.2 కోట్లు వెచ్చిస్తున్నారు. కాగా ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే తేదీని బట్టి ప్రారంభోత్సవం చేయించాలని వీఎంఆర్‌డీఏ వర్గాలు భావిస్తున్నాయి.

## గవర్నమెంట్ ఉద్యోగే, 100 కోట్లకు పైగానే అక్రమ ఆస్తులు

హైదరాబాద్ గచ్చిబౌలిలోని విద్యుత్ శాఖలో ఏడీఈగా పని చేస్తున్న సతీష్ లంచం తీసుకున్న కేసులో విచారణ కొనసాగుతోంది. సతీశ్ ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓ ఇంట్లో ట్రాన్స్‌ఫార్మర్, సీటీ మీటర్ బిగించడానికి ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వీటిని ఏర్పాటు చేసేందుకు రూ.75 వేలు ఇవ్వాలని ఏడీఈ సతీష్ డిమాండ్ చేశాడు. మొదట రూ.25 వేలు ఇచ్చాడు. మిగతా 50 వేలు శుక్రవారం అందించగా.. ఇదే సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయానికి చేరుకొని తనిఖీలు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సతీష్‌ను నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఏసీబీ అధికారులు 2 రోజులపాటు మాదాపూర్‌లోని సతీష్ నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సతీష్‌కు హైదరాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో 22 ఎకరాల వ్యవసాయ భూమి, విల్లా, ఓపెన్ ప్లాట్లు, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. నగరంలో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లతో ప్రతీ నెల లక్షల రూపాయల కిరాయిలు వస్తాయని అధికారుల విచారణలో తెలింది.

# 19న ఢిల్లీ సీఎం అభ్యర్థి ఖరారు!

ఢిల్లీ కాబోయే ముఖ్యమంత్రి ఎవరు? అనే అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. బీజేఎల్పీ భేటీ నేపథ్యంలో ఇవాళ సాయంత్రంలోపు స్పష్టమైన ప్రకటన వెలువడొచ్చని అంతా భావించారు. అయితే చివరి నిమిషంలో ఆ భేటీని వాయిదా వేస్తూ బీజేపీ పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఇవాళ జరగాల్సిన బీజేఎల్పీ సమావేశాన్ని వాయిదా వేసింది ఆ పార్టీ. ఢిల్లీ స్టేషన్ తొక్కిసలాట ఘటనకు సంఘీభావంగానే సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించింది. తిరిగి.. ఫిబ్రవరి 19న ఈ భేటీని నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే అదే తేదీన సీఎంతో పాటు కేబినెట్ కూర్పుపైనా ఓ ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. ఈలోపు రేపు మరోసారి సీఎం అభ్యర్థిపై అధిష్టానం సమాలోచనలు జరపనున్నట్లు సమాచారం. బీజేపీ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారం.. 19వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన బీజేఎల్పీ జరగనుంది. ఆ భేటీలో సీఎం అభ్యర్థి పేరు ప్రకటన ఉంటుంది. ఆ తర్వాత కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు సరాసరి లెఫ్టినెంట్ గవర్నర్ దగ్గరకు వెళ్తారు. బీజేఎల్పీ నేత, కేబినెట్ పేర్లు ఉన్న వివరాలు అందజేసి ప్రభుత్వ ఏర్పాటునకు ఆహ్వానించాలని ఎల్జీని కోరనున్నారు.

అందుకే ఆలస్యం!

ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగ్గా.. 8వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 70 స్థానాల్లో బీజేపీ 48, ఆప్ 22 గెలుచుకున్నాయి. సుమారు మూడు దశాబ్దాల తర్వాత ఢిల్లీ పీఠం కమలం కైవసం చేసుకుంది. అయితే.. సీఎం ఎంపికలో ఆచీచూతీ వ్యవహరించాలని బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు జేపీ నడ్డా నాయకత్వంలో అంతర్గత సంప్రదింపులు సైతం జరిపింది. అదే సమయంలో.. ప్రధాని మోదీ విదేశీ పర్యటనకు వెళ్లడంతో ఎంపిక ఆలస్యమైంది. ఈలోపు ఢిల్లీ విషాదంతో.. మరోసారి ఆ భేటీ వాయిదా పడింది. ఇక 19వ తేదీన జరగబోయే బీజేఎల్పీ సమావేశానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో పాటు పార్టీ జాతీయ కార్యదర్శులు సైతం హాజరు కానున్నట్లు తెలుస్తోంది. అలాగే బీజేపీ పాలిత ప్రాంతాల్లో మాదిరే.. ఢిల్లీకి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ప్రతిపాదనను అధిష్టానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ప్రమాణం ఎప్పుడంటే..

ఆ మరుసటిరోజు(ఫిబ్రవరి 20న) రామ్ లీలా మైదానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. మోదీ, అమిత్ షా సహా బీజేపీ అగ్ర నేతల సమక్షంలో సీఎం, మంత్రి వర్గం ప్రమాణం చేయనుంది. ఈ మేరకు కార్యక్ర కో ఆర్డినేటర్లుగా వినోద్ తావ్డే,తరుణ్ చుగ్‌లను బీజేపీ హైకమాండ్ నియమించింది. ఇక.. ఢిల్లీ సీఎం రేసులో పర్వేష్ వర్మ(న్యూ ఢిల్లీ), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), విజేందర్ గుప్తా (రోహిణి), సతీష్ ఉపాధ్యాయ్ (మాల్వియా నగర్), ఆశిష్ సూద్ (జనక్‌పురి), పవన్ శర్మ (ఉత్తమ్ నగర్), అజయ్ మహావార్ (ఘోండా)ర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. జనాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న నేతకే ఢిల్లీ పగ్గాలు అప్పగించాలని అధిష్టానం ఓ అంచనాకి వచ్చినట్లు తెలుస్తోంది.

ఓవర్‌హైప్... పాకిస్తాన్ కనీస పోటీ కూడా ఇవ్వదు.

## భారత మాజీ క్రికెటర్

భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ అంటే క్రికెట్ ప్రేమికులకు పండుగే. ఇరుదేశాల సంబంధాల దృష్ట్యా ఈ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఎప్పుడో నిలిచిపోయాయి. ఆసియా కప్, ఐసీసీ వంటి అగ్రశ్రేణి ఈవెంట్లలో మాత్రమే ముఖాముఖి తలపడుతున్నాయి. అందుకే దాయాదుల మధ్య పోరును వీక్షించేందుకు అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తుంటారు. వారి నిరీక్షణకు ఫిబ్రవరి 23న తెరపడనుంది. చాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా దుబాయ్ వేదికగా ఆదివారం భారత్- పాక్ జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా స్పిన్ దిగ్గజం హర్భజన్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

ఓవర్‌హైప్...

''ఇండియా- పాకిస్తాన్.. ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్‌కు ఓవర్‌హైప్ ఇస్తున్నారు. దీనికి ఇంతగా ప్రచారం అవసరం లేదు. ఓసారి పాకిస్తాన్ ప్రధాన బ్యాటర్ల గణాంకాలు పరిశీలించండి.

హైదరాబాద్‌లోని పబ్‌లో డ్రగ్స్ కలకలం..

## 20 మందికి డ్రగ్స్ టెస్ట్‌లు

హైదరాబాద్‌లో మరోసారి మందు పార్టీ కలకలం సృష్టిస్తోంది. మాదాపూర్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లోని ఆలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ వాడినట్లు దుమారం రేపుతోంది. పక్కా సమాచారం రావడంతో నిన్న రాత్రి పోలీసులు సోదాలు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆలివ్ బిస్ట్రో పబ్‌పై మాదాపూర్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. తనిఖీల్లో భాగంగా 20 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సింది.కాగా, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి కృషి చేస్తోంది.




## శివకార్తికేయన్ కొత్త సినిమాకు అదిరిపోయే టైటిల్ ఫిక్స్

శివకార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త సినిమా టైటిల్ ప్రకటనతో పాటు అదిరిపోయే గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. మావీరన్, అయలాన్, అమరన్ చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన శివ కార్తికేయన్. ఇప్పుడు మరో భారీ విజయంపై కన్నేశాడు. తన కెరీర్‌లో 23వ చిత్రాన్ని ఏఆర్.మురుగదాస్ తెరకెక్కిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ టైటిల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తమిళ అభిమానులకు విపరీతంగా కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రానికి మదరాసి అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ కూడా పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్‌లతో ఉంది.మదరాసి చిత్రంలో శివ కార్తికేయన్ పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నటిస్తున్నట్లు తెలిసింది. కాగా నటి రుక్మిణి వసంత్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే పూర్తి అయ్యింది. శ్రీ లక్ష్మి మూవీస్ బ్యానర్‌పై శ్రీ లక్ష్మి ప్రసాద్, సుందర్‌రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సమ్మర్‌లో ఈ చిత్రం విడుదల కానుంది.

## కేసీఆర్ పుట్టినరోజు.. కేటీఆర్ ఎమోషనల్ కామెంట్స్

నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ప్రముఖులు, పార్టీ నేతలు, రాజకీయ నాయకుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా కేసీఆర్ తనయుడు కేటీఆర్.. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ట్విట్టర్ వేదికగా ఎమోషనల్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..'ప్రతీ తండ్రీ తమ పిల్లల హీరో అని అంటారు. నా తండ్రి నా ఒక్కడికే కాదు.. తెలంగాణ హీరో కావడం నా అదృష్టం. కల కనడం.. దాని కోసం హద్దులేని నిబద్ధతతో బయలుదేరారు. విమర్శకులను ఎదుర్కోవడం, అది ఎలా నెరవేరుతుందో వారికి గర్వంగా చూపించారు. తెలంగాణ అనే కలను ప్రేమించారు. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా తెలంగాణ సాధించారు. మీరు గర్వంగా మీ కొడుకని పిలుచుకునే వ్యక్తి కావడమే నా లక్ష్యం. మీ వారసత్వానికి అర్హులుగా ఉండటానికి ప్రతీక్షణం కృషి చేస్తా' అంటూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఇక, కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలుపుతూ కేసీఆర్‌తో ఆశీర్వాదం తీసుకున్న ఫొటోను షేర్ చేశారు.మరోవైపు.. తెలంగాణభవన్‌లో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో కేటీఆర్, తలసాని శ్రీనివాస్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## మోనాలిసాకు కలిసొచ్చిన మరో అదృష్టం

ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తేనెకళ్లతో అందరి దృష్టిని ఆకర్షించిన మోనాలిసా ఎంత ఫేమస్ అయిందో అందరికీ తెలిసిన విషయమే. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన మోనాలిసా మహాకుంభమేళాలో రుద్రాక్షలు, పూసల దండలు అమ్ముకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో ఆమెను చూసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు. ఆమె ఫొటోలు, వీడియోలు తీసి పోస్ట్ చేశారు. దీంతో ఆమె ఒక్కసారిగా వైరల్ కావడం.. ఓవర్‌నైట్ స్టార్‌గా ఎదిగిన మోనాలిసాను చూడటానికి జనం ఎగబడ్డారు. ఈ నేపథ్యంలో ఆమెకు బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా సినిమా ఆఫర్ కూడా ఇచ్చారు. ఆమె త్వరలోనే మూవీ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మధ్య మోనాలిసాకు సంబంధించి ఏ వార్త అయిన ఇట్టే వైరల్‌గా మారుతోంది. ఈ తరుణంలో మహాకుంభమేళాతో దేశవ్యాప్తంగా వైరలైన లక్కీ గర్ల్ మోనాలిసాకు మరో ఖ్యాతి దక్కింది. ఈ నెల(ఫిబ్రవరి) 26వ తేదీన నేపాల్‌లో జరిగే శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కుంభమేళా బ్యూటీ మోనాలిసాకు ఆహ్వానం అందింది.ఈ తేనె కళ్ల సుందరితో సినిమా సినిమా చేస్తున్న సనోజ్ మిశ్రా, ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ కూడా ఈ వేడుకలకు హాజరు కానున్నారు. ఇటీవల ఆమె కేరళలో ఓ జువెలరీ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వెళ్లగా అభిమానులు బ్రహ్మరథం పట్టిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా ఒకరి జీవితాన్ని ఎలా మార్చిందో చూడండంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసిన వారి దశ దిశ ఏం మార్చిందో గాని.. ఆ కుంభమేళాలో పూసలమ్ముకునేందుకు వచ్చిన లక్కీ గర్ల్ మోనాలిసా జీవితాన్ని మాత్రం మార్చేసిందంటూ సోషల్ మీడియా వేదికగా కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# భక్త జనసంద్రంగా మారిన పెద్దగట్టు

శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి దేవరపెట్టె చేరుకోవడంతో దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. 'ఓ లింగ___ఓ లింగా' నామస్మరణతో పెద్దగట్టు మారుమ్రోగుతోంది. గుట్ట చుట్టూ వాహనాలు చేరి.. జాతర భక్త జనసంద్రంగా మారింది. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు.

జాతరలో కీలకమైన దేవరపెట్టె కాగా తెలంగాణలో సమ్మక్క సారలమ్మ జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన సూర్యాపేట శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో కీలకమైన దేవరపెట్టె (అందెనపు చౌడమ్మ, లింగమంతుల స్వామి ఉత్సవ మూర్తులు)కు ఆనవాయితీ ప్రకారం కేసారం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపెట్టెను ఊరేగింపుగా ఆదివారం అర్ధరాత్రికి దురాజ్‌పల్లిలోని పెద్దగట్టుకు చేర్చారు. దీంతో జాతర ప్రారంభమైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేసారంలోని మెంతబోయిన వంశస్తులకు చెందిన దేవరగుడిలో దేవరపెట్టెకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్నా, గొర్ల, కులస్తులతోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

ఇక, పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్- విజయవాడ మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నామని కోదాడ డీఎస్పీ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించి, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా అదే మార్గంలో కోదాడ వద్ద జాతీయ రహదారితో కలవనున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది.

గుడి చుట్టూ ప్రదక్షిణ

ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత భక్తులు గంపలను నెత్తిపై పెట్టుకొని కాళ్లకు గజ్జెలు కట్టుకొని గొర్రెలకు అలంకరణ చేసి లింగమంతుల స్వామి గుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. కుటుంబ సభ్యులంతా ప్రదక్షణలో పాల్గొన్నారు. అనంతరం గుట్టపైన జంతు బలులు జరిగాయి. సోమవారం ఆరు లక్షలకు పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

జాతరలో నేడు

సోమవారం తెల్లవారుజాము నుంచి గుట్ట వద్ద భక్తులు పసుసు, కుంకుమతో బోనాన్ని అలంకరించుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి దేవుళ్లకు బోనాలు సమర్పిస్తారు.

## తండ్రిపై చిన్నారి ఫిర్యాదు

తండ్రి తన పాకెట్ మనీ తీసేసుకున్నాడంటూ ఓ చిన్నారి ఫిర్యాదు చేయడంద చైనాలో సంచలనంగా మారింది. చిన్నారి ఫిర్యాదు విని గాబరాగా అతడి ఇంటికెళ్లిన పోలీసులు అసలు విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు. నెట్టింట కూడా ఈ ఉదంతంపై ఆసక్తి వ్యక్తమవుతోంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. గాంన్సూ ప్రావిన్స్‌లోని లాంగ్జూ ప్రాంతంలో ఈ ఘటన వెలుగు చూసింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఓ చిన్నారి ఇటీవల పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ''ఓ చెడ్డ వ్యక్తి మా ఇంట్లో ఉన్నాడు. నా డబ్బు దోచుకున్నాడు'' అని ఫోన్‌లో చెప్పారు. ఇది విని మొదట అధికారి షాకయ్యారు. అల్లరి పిల్లాడా.. పోలీసులకు ఫోన్ చేశావా? అన్న మాటలు కూడా ఫోనులో వినిపించాయిఆ తరువాత తనిఖీ కోసం అక్కడికి వెళ్లాక పోలీసులకు అసలు విషయం అర్థమైంది. ''అంకుల్ మీరు భలే త్వరగా వచ్చేశారే.. ఇదిగో ఈయనే నా డబ్బు తీసుకుంది.. ఈ చెడ్డ వ్యక్తిని అరెస్టు చేయండి'' అంటూ అమాయక ధోరణిలో చెప్పుకుపోయాడు. విషయం అర్థం కావడంతో పోలీసులు కూడా ఒకింత ఆశ్చర్యపోయారు. చైనా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు చిన్న పిల్లలకు ఏదైనా కొనుక్కోమని పాకెట్ మనీ ఇస్తుంటారు. ఓ ఎరుపు ఎన్వలప్‌లో పెట్టి ఈ డబ్బు బహుమతిగా ఇస్తారు. ఇలా చేస్తే ఆ ఏడాది అదృష్టం వెంటే ఉంటుందని వారి నమ్మకం. అయితే, ఆ డబ్బులతో చిన్నారులు దుబారా ఖర్చులకు దిగకుండా ఎన్వలప్‌ను వెనక్కు తీసేసుకుంటారు. ఇక చిన్నారి విషయంలో కూడా ఇదే జరిగింది. చిన్నారికి ఇలా వచ్చిన డబ్బును జాగ్రత్త చేద్దామని బాలుడి తండ్రి తీసుకున్నాడు. ఇది చిన్నారికి సుతరామూ నచ్చలేదు.

## అన్నను పొడిచి చంపిన తమ్ముళ్లు

మద్యం మత్తులో ఇంటిల్లిపాదిని తిడుతూ నిత్యం నానాయాగి చేస్తున్న అన్నను అతని తమ్ముళ్లే చంపేశారు. కత్తులతో వెంబడించి విచక్షణారహితంగా పొడిచి నడిరోడ్డుపైనే అతని ప్రాణం తీశారు. మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఉమేశ్(30) అనే వ్యక్తి మరణించాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా, మాసిరెడ్డి గ్రామానికి చెందిన గన్య.. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగరిత్యా భార్య, కుమారులు ఉమేశ్, రాకేశ్, కుమార్తెతో కలిసి గన్య మేడ్చల్‌లో నివాసముంటున్నాడు. గన్య పెద్దకొడుకు ఉమేశ్(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, కుటుంబ కలహాల వల్ల మద్యానికి బానిసైన ఉమేశ్ మద్యం మత్తులో ఇంటికివచ్చి నిత్యం గొడవలు పడుతుంటాడు. అలాగే, ఆదివారం కూడా తప్పతాగి ఇంటికొచ్చిన ఉమేశ్.. తల్లి, భార్యను కొట్టడమే కాక ఇతర కుటుంబసభ్యులను దుర్భాషలాడాడు. దీంతో ఆగ్రహించిన అతని తమ్ముడు రాకేశ్, వారి బాబాయి కొడుకు లక్ష్మణ్‌తో కలిసి ఉమేశ్‌పై దాడి చేశాడు. వారి నుంచి తప్పించుకున్న ఉమేశ్.. మేడ్చల్ ఆర్టీసీ డిపో ముందున్న జాతీయ రహదారిపై పరుగులు తీశాడు. అయితే, ఉమేశ్‌ను అడ్డుకున్న రాకేశ్, లక్ష్మణ్ తమ వెంట తెచ్చుకున్న కత్తులతో అతనిపై విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. దాదాపు 12 కత్తిపోట్లకు గురైన ఉమేశ్ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఉమేశ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, ఈ దారుణాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయబ్రాంతులకు గురయ్యారు. దాడిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించినా ఆపలేకపోయారు.

## జేసీ ప్రభాకర్‌పై కేసు నమోదు.. షాకిచ్చిన మాధవీలత

తాడిపత్రి టీడీపీ మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డికి ఊహించని షాక్ తగిలింది. సినీ నటి, బీజేపీ నేత మాధవీలత ఇచ్చిన ఫిర్యాదుతో ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో జేసీ.. తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు, ఆయన అనుచరులు తనను బెదిరిస్తున్నారని మాధవీలత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బీజేపీ నేత మాధవీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అయితే, న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి, మాధవీలత మధ్య మాటల యుద్ధం నడిచిన విషయం తెలిసిందే. డిసెంబర్ 31న తాడిపత్రిలోని జేసీ పార్కులో 'మహిళలకు మాత్రమే' అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై మాధవీలత స్పందిస్తూ.. ఇలాంటి వేడుకలకు వెళ్లకూడదని, తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి వేళ ఏదైనా జరిగితే ఎవరు కాపాడతారని, జేసీ పార్కులో వేడుకలకు వెళ్లొద్దని సూచించారు. దీంతో జేసీ ఒక్కసారిగా భగ్గుమన్నారు.

## బాత్రూంలోకి తొంగిచూస్తున్నారు.. విద్యార్థినిల ఆందోళన

జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. హాస్టల్‌లో తమకు భద్రత కరువైందని వారు ఆరోపిస్తున్నారు. బాత్‌రూమ్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు తొంగిచూస్తున్నారంటూ అర్ధరాత్రి విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. రక్షణ కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. తరగతులను బహిష్కరించారు. విద్యార్థినుల ఆందోళనకు మద్దతుగా విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. హాస్టల్ గదుల్లోని, బాత్‌రూమ్‌లోకి కొంతమంది వ్యక్తులు తొంగి చూస్తున్నారని.. దీనిపై అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని పెద్దఎత్తున నిరసనకు దిగారు. అర్ధరాత్రి వరకు ఆందోళనలు చేశారు విద్యార్థినిలు. తాము పడుతున్న ఇబ్బందులను, కష్టాలను కాలేజీ యజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పుడు పట్టించుకోకపోవడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్ చుట్టుపక్కల కన్‌స్ట్రక్షన్ పనులు చేస్తున్న క కొంత మంది అదేపనిగా హాస్టల్ గదులతో పాటు, బాత్‌రూమ్ కిటీల నుంచి తొంగి చూస్తున్నారని, తమకు హాస్టల్‌లో రక్షణ కరువైన పరిస్థితి నెలకొందని స్టూడెంట్స్ వాపోతున్నారు. ఏ క్షణంలో ఎవరు వస్తారో అనే ఆందోళనలో విద్యార్థినిలు గడుపుతున్నారు. వీటిపై సెంట్రల్ యూనివర్సిటీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విద్యార్థినిలు డిమాండ్ చేస్తున్నారు.

## ఫామ్‌హౌస్ కేసు.. పోలీసులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వివరణ

ఫామ్‌హౌస్‌లో కోడిపందాల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు వివరణ ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ఫామ్ హౌస్ ఎమ్మెల్సీది కావడంతో పోలీసులు నోటీసులు ఇచ్చారు. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని, అలాగే ఫామ్‌హౌస్‌కు సంబంధించి వివరాలు ఇవ్వాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. దీంతో న్యాయవాదితో కలిసి వచ్చిన ఎమ్మెల్సీ.. మొయినాబాద్ పోలీసులకు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. కోడి పందాలు ఆడించిన ఫామ్ హౌస్ తనదేనని 2023 వర్రా రమేష్ కుమార్ రెడ్డికి లీజ్‌కు ఇచ్చినట్లు పోచంపల్లి పేర్కొన్నారు. రమేష్ కుమార్‌తో పాటు మరొకరి కూడా లీజ్‌కు ఇచ్చినట్లు వెల్లడించారు. లీజ్ పత్రాలను కూడా పోలీసులకు అందజేశారు పోచంపల్లి. లీజ్‌కు ఇచ్చిన భూమిని ఏపీకి చెందిన వ్యాపారి భూపతి రాజు శివ కుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కోడి పందాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వివరణ ఇచ్చారు. కాగా.. భూపతిరాజు

శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ అనే వ్యక్తి అదే ఫామ్‌హౌస్‌లో రెండు మూడు సార్లు పెద్దఎత్తున కోడిపందాలు, క్యాసినోలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో మరోసారి కోడిపందాలు నిర్వహించాడు గబ్బర్ సింగ్. సంక్రాంతి పండగ తర్వాత మిగిలిన కోళ్లను ఫామ్‌హౌస్‌కు తీసుకువచ్చి కోడిపందేలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

## 'భాగ్యశ్రీ'కి మరో బంపర్ ఆఫర్!

తమిళ హీరో సూర్య తెలుగులో ఎప్పుడు మంచి సినిమా చేస్తారా ? అని తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తానికి ఆ సమయం ఇప్పుడు వచ్చేసింది. ఈ క్రమంలో వెంకీ అట్లూరికి సూర్య ఓకే చెప్పారు. ఏ గెటప్ లు, సందేశాలు ఏమీ లేకుండా చక్కటి లవ్ స్టోరీని వెంకీ, సూర్యకి చెప్పారు. ఈ సినిమా మే నుంచి స్టార్ట్ కాబోతుంది. సితార నాగవంశీ ఈ సినిమాకి నిర్మాత. అన్నట్టు ఈ సినిమాకు హీరోయిన్ గా భాగ్యశ్రీ భోర్సే ను తీసుకునే ప్లాన్ లో ఉన్నారు. అయితే, భాగ్యశ్రీ భోర్సే ను ఇంకా ఫైనల్ చేయలేదు. కాకపోతే, ఆమెనే మెయిన్ హీరోయిన్ గా తీసుకోవడానికి ఎక్కువ అవకాశం ఉందట. ఇప్పటికే, భాగ్యశ్రీ భోర్సే.. విజయ్ దేవరకొండ, రామ్ సరసన సినిమాలు చేస్తోంది. నిజానికి భాగ్యశ్రీ భోర్సే, తొలి సినిమా మిస్టర్ బచ్చన్ ప్లాప్ అయింది. అయినప్పటికీ, భాగ్యశ్రీకి మాత్రం తెలుగులో వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే సూర్య సరసన ఆమెకు ఛాన్స్ వచ్చింది.

## కలకలం సృష్టిస్తున్న జీబీఎస్

గులియన్ బారే సిండ్రోమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వణికిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 59 కేసులు నమోదు అయ్యాయి. ఈ వ్యాధితో ఏపీలో ఇప్పటివరకూ ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు గుంటూరు జిల్లాను జీబీఎస్ బెంబేలెత్తిస్తోంది. ఈ వ్యాధితో గుంటూరు జీజీహెచ్‌లో కమలమ్మ అనే వృద్ధురాలు ఆదివారం నాడు మృతిచెందింది. కాగా, జీజీహెచ్‌లో కొత్తగా మరో 8 కేసులు నమోదు కావడం తీవ్ర కలకలం రేపుతోంది. వీరిలో ఆశీర్వాదం అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితుడికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుల్లో ఇద్దరు కోలుకుని ఇంటికి వెళ్లిపోగా.. మరో నలుగురు సాధారణ వార్డుల్లో చికిత్సపొందుతున్నట్లు వైద్యులు తెలిపారు.

ఇద్దరు మృతి..

కాగా, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మ(50)

జీబీఎస్ బారినపడ్డారు. ఈనెల 2న రాత్రి తీవ్ర కండరాల నొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబసభ్యులు గిద్దలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈనెల 3న గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు కమలమ్మకు జీబీఎస్ పాజిటివ్‌గా నిర్ధారించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వృద్ధురాలు ఆదివారం నాడు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆరేళ్ల బాలుడు సైతం గత వా రం ఈ వ్యాధితో మృతిచెందాడు.